# స్నేహరాహిత్యం

శైలకుమార్

"నిద్రకు వెలియై
నేనొంటరినై
నా గది లోపల చీకటిలో..."

**అయిపోయింది. మానసిక సున్నితత్వం చచ్చిపోతే ఇక మనిషి జీవితం ఎంత వృధా? ఏ స్పందనా లేకపోతే మనిషికి, రాయికి ఏమిటి తేడా? కోపం, బాధ, ఆనందం, ఉద్రేకం అన్నీ కలిసి వుంటేనే మనిషి. వాటన్నిటికీ అతీతమైతే ఇక జీవించటం ఎందుకు? ఎక్కడికో పారిపోవచ్చు.**

తల బద్దలుచేస్తున్నాయి ఆలోచనలు. కుర్చీలో వెనక్కివాలి ఆ నిశ్శబ్దంలో సన్నగా వెలుగుతున్న దీపం కేసి చూస్తూ వుండిపోయాను. ఏదో శూన్యం ఆవరించింది మనసును. ఏదో బాధ. ఎవ్వరూ పోగొట్టలేని ఏకాంతం. ఎంత భయంకరం ఒంటరితనం. అందులోనూ మానసికంగా.

ప్రక్కగదిలో ఫ్యాను క్రింద గాఢంగా నిద్రపోతోంది భార్య. అర్ధరాత్రి వరకూ మేలుకుంటానని విసుగు. భార్య సామీప్యంలో కూడా ఏకాంతం. నవ్వుతారు ఎవరైనా. కాని ఇది శారీరకం కాని మానసిక తపన. ఆకారం ఇవ్వలేని అంతర్మధన.

అసలు ప్రపంచంలో ప్రతి మనిషీ ఒంటరే. ఒక మనిషి బాధనో ఆనందాన్నో మరొకరు వినగలరే తప్ప పంచుకోలేరు. అదే స్థాయిలో అనుభవించలేరు. అసలు మనిషికీ మనిషికీ మధ్య ఆర్థిక సంబంధం తప్ప ఈ సమాజంలో మరేం మిగుల్తోందని.

సిగరెట్ వెలిగించాను. నాలో నాకే ఎన్నో సందేహాలు, అనుమానాలు. బాధ్యతల సంకెళ్ళలో జీవితపు ఇనుప పాదాల క్రింద నలిగి ఎక్కడికక్కడ విడిపోయారు స్నేహితులంతా. ఎవరి ప్రపంచం వాళ్ళది. చదువుకునే రోజుల్లోని ప్రేమ, అభిమానం, ఆత్మీయత, త్యాగం ఎవ్వరిలోనూ కనిపించటం లేదు. అంతా యాంత్రికత. గానుగెద్దులాంటి గమనం.

కిరీటి, కరుణ, రమణ, సత్య, క్రిష్ణ అందరూ కళ్ళముందే. కాని పెరిగిపోతున్న ఏదో దూరం. మాటల్లో చెప్పలేని మనసుకందని భారం.

ఇల్లు కాదని వచ్చేసినప్పుడు, ఆశయాలు ఆకాశంలో విహరిస్తూ ఆశల్ని చుక్కల్లో లెక్కబెడుతున్నపుడు ఆకలేస్తే అందరూ అన్నం పెట్టినవాళ్ళే. మనసుకు భయమేసినపుడు అందరూ వెన్నుతట్టి వెంట నిలిచిన వాళ్ళే.

ఇప్పుడూ వాళ్ళే - ఆకారాలు మారలేదు. అనుభూతులు, ఆప్యాయతలు తప్ప. ప్రపంచంలోని ప్రతి సంబంధాన్ని డబ్బే పాలిస్తుందని చెప్పిన మార్క్స్ ఎంత గొప్పవాడివయ్యా, ఎన్నేళ్ళ ముందుకు చూడగలిగావయ్యా.

ఆలోచనలు తెగవు. అశాంతికి అంతం లేదు.

గుండె గొంతుకతో కొట్లాడుతూ వుంటే ఆ భావాలకు అక్షరాలు కూర్చటం నేర్పింది కిరీటి. శోకభీకరంగా లోకం కనిపిస్తూ వుంటే ఆ తిమిరంతో సమరం చేయటానికి అక్షర శతఘ్నుల్ని దట్టించటం నేర్పింది కిరీటి. రాములవారి గుడిలో, సాయంత్రపు నీరెండ బడిలో యౌవన ధనుస్సుల్ని మోస్తున్న పసుపు రాసిన పాదాలు కళ్ళముందు కదలిపోతూ వుంటే ఆ చరణ కిరణాల నుంచి ఎన్ని కవితాభరణాల్ని ఏరుకున్నాం. ఆరుబయట వెన్నెల మైదానాలలో ఒక్క బీడీని ఇద్దరం కాలుస్తూ ఎన్ని కలలు పేర్చుకున్నాం.

ఏడీ వాడు. ఉన్నాడు ఓ దిక్కుమాలిన ఆఫీసులో గుమాస్తాగా. కనిపిస్తే కాఫీ ఇప్పించి మేనేజరు ఎన్నిరకాలుగా తిడతాడో, ఇంటికెళ్తే భార్య ఏమేం లేవంటుందో చెబుతాడు. కూడికలు తీసివేతల మధ్య నలిగి ఎన్నో తీసేశాడు జీవితం నుంచి.

రాత్రిళ్ళు టీ బంకుల దగ్గర కూర్చుని గంటలకొద్దీ గజల్స్ వినటం, డబ్బు లేక లుంగీలు కట్టుకుని నేల క్లాసుకు సెకండ్ షోకు వెళ్ళటం, ఉన్న ఒకే ఒక సిగరెట్‌ను అందరం ఆనందంగా తాగటం, చీకట్లో ముడుచుకు పడుకున్న తారు రోడ్ల మీద కులాసాగా కూనిరాగాలుతీస్తూ నడవటం ఎవరికి గుర్తున్నాయి ?

కాలేజీ ఫీజుకు డబ్బు లేకపోతే ఉంగరం అమ్మి కట్టింది రమణ. కడుపులోని ఆకలి కేకల్ని పసిగట్టి గడ్డపెరుగుతో భోజనం పెట్టించి, పుస్తకాలిచ్చి చదివించింది సత్య. ఆశలు, ఆవేశాలు, కన్నీళ్ళు కలబోసుకుని నీ కోసం నేనంటూ నీడలా వెన్నంటి వున్నది కరుణ.

ఏరీ వీళ్ళంతా. కిరసనాయిలు అమ్ముకుంటూ ఒకడు, కాంట్రాక్టులలో రోడ్డుకు తారు పూసుకుంటూ ఒకడు, మనుషుల్ని నమ్మి, వున్నవన్నీ అమ్మి ఊడ్చుకుపోయిన ధైర్యంతో నీరసంగా ఒకడు.

ఎందుకిలా కాలం మోసం చేసింది? ఎందుకు సామీప్యంలోనే అందనంత దూరం తోసింది.

ఓ రోజు అప్పు అడిగానొకణ్ణి జేబులో ఆరు వందలు వున్నా.

"నీ జీతం ఏమైంది?"

"జేబు కొట్టేశారు."

కొద్దిసేపు మాట్లాడలేదు వాడు. ఇవ్వాలా వద్దా అన్న సందేహంలో, ఇస్తే మళ్ళీ తిరిగి ఇస్తాడా అన్న అనుమానంతో కొట్టుకుంటున్నాడేమో?

"ఇంట్లో నాలుగొందలున్నాయిరా. కాని మా ఆవిడకు చీర కొనుక్కోమని చెప్పాను" చెప్పలేక చెప్పాడు.

నవ్వుకున్నాను. నా జేబులో డబ్బుందని తెలిస్తే వాడేమనేవాడో. వాడి భుజంమీద చేయి వేసి హోటలులోకి లాక్కెళ్ళాను కాఫీ కోసం.

బాధ్యతలు పెరిగిన జీవితాలు బరువెక్కుతాయి. కాని ఆ బరువు హృదయాన్ని నొక్కెయ్యకూడదు.

ఎలా వుండేవి ఆ రోజులు. ఎక్కడికి వెళ్ళినా ఏం చేసినా అందరం కలిసే. ఏదో తెలుసుకోవాలని, ఎన్నెన్నో నేర్చుకోవాలని, ఈ మనుషులకు అందనంత ఎత్తులో బ్రతకాలని. ఎన్ని నమ్మకాలు, ఎంత పట్టుదల.

మాట్లాడుకుంటూ కూర్చున్న మా మధ్య రాత్రులు నిర్దాక్షిణ్యంగా నలిగిపోయేవి. ప్రపంచంలోని ప్రతీదీ మా మాటల్లోనే. ఆకాశాలను లోకానికి చేరువగా తీసుకు వస్తామని, స్వర్గాలు పెకిలించి మనుషులందరికీ పంచి పెడతామని మా నమ్మకం అప్పుడు. ఆకలీ నిద్రా అసలు సమస్యలే కావు.

ఇప్పుడూ కలుస్తాం అందరం ఎక్కడో బజారులో అనుకోకుండా. పెరిగిపోతున్న కూరగాయల ధరల గురించి ఒకడు, వంటాడి జ్వరం గురించి ఒకడు మాట్లాడతారు. ఫ్రిజ్ కొన లేకపోవటం ఒకడి సమస్య. ప్రమోషను రాలేదని, ఇంక్రిమెంటుకు ఇంకా ఆరునెల్లు ఆగాలని ఒకడి బాధ.

ఎక్కడికి పారిపోతున్నారు వీళ్ళు. ఎందుకు తీస్తున్నారు ఈ అర్థం లేని పరుగు.

మరో సిగరెట్ వెలిగించాను. టీ తాగాలని వుంది. పాలు ఎక్కడా కనిపించలేదు వంటింట్లో.

చొక్కా వేసుకుని తలుపుకు తాళం పెట్టి రోడ్డు మీదకు వచ్చాను. చీకటి నిశ్శబ్దం, నిర్మానుష్యం. అర్ధరాత్రి వింటర్‌లో ఒంటరిగా టీ కోసం. దూరంగా ఎక్కడో వీధి కాపలా తిరుగుతున్న గూర్ఖా విజిల్. నిద్రపోతున్న కుక్క అడుగుల చప్పుడుకు లేచి మొరుగుతోంది.



ఎంత కృత్రిమత నిండిపోతోంది బ్రతుకులో. క్షణం క్షణం నటన. దొంగ నమస్కారాలు, దొంగ నవ్వులు, దొంగ మాటలు. ప్రక్కవాడిని చూస్తే భయం మనది దోచుకుంటాడేమో, పరుగు పందెంలో మనల్ని వెనక్కు నెట్టేస్తాడేమో అని.

ఇంతకు ముందెప్పుడూ ఇలా రాలేదు టీ కోసం ఒంటరిగా. నడుస్తున్నాను. దారిలో కృష్ణ ఇల్లు. అప్రయత్నంగా తలుపు తట్టాను.

"ఎవరూ" లోపలనుంచే అడిగాడు.

"నేను."

"ఏరా" అంటూ తలుపు తీశాడు గొంతు గుర్తుపట్టి.

"ఇలారా" అంటూ వాడి చేయి పట్టుకుని మసక వెన్నెల పడుతున్న ఇంటి అరుగు మీద కూర్చోపెట్టాను.

"ఏమిట్రా" ఆతృత వాడి కంఠంలో.

వాడి మొహంలోకి సూటిగా చూశాను. ఏదీ ఒకప్పటి ఉత్సాహం. ఏదీ ఒకప్పుడు తుళ్ళిపడిన చైతన్యం.

"ఏమిట్రా అమ్మకేమైనా!"

"ఊహూ! అదేమీ కాదు. నాకే ఇలా నీతో కూర్చోవాలని, కలిసి కబుర్లు చెప్పాలని."

"చంపావు కదరా. బంగారం లాంటి నిద్ర పోయింది." ఆవులిస్తూ అన్నాడు.

నిద్ర బంగారమా. పోలికలోనూ ఆర్థికపు వాసన.

"ఒరే నీవు రూములో చదువుకునేటపుడు అర్ధ రాత్రుళ్ళు నే వస్తే ఇలాగే అనేవాడివా? ఆ రోజులు గుర్తులేవూ?"

"అవంటే బరువులు బాధ్యతలు లేని రోజుల్రా. ఇప్పుడెలా కుదురుతుంది."

నాకేం చెప్పాలో తెలీక వాడినే చూస్తుండిపోయాను.

"సరే పొద్దున్నే కలుద్దాం" లేచాడు నన్ను కదలమన్నట్లు.


మౌనంగా టీ బంకు దగ్గరకు వచ్చాను. "కల ఇదనీ, నిజమిదనీ తెలియదులే" సన్నగా వినపడుతోంది రికార్డు. ఎవరో నలుగురు కాలేజీ విద్యార్థులు టీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఒరేయ్ నీ కోసం నేనేమైనా చేస్తాను" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"ఉద్యోగం అయినా సరే ఒకే ఊర్లో వస్తేనే చేద్దాం" రెండోవాడు.

"కొంపదీసి ఇద్దరూ ఒకే అమ్మాయిని చేసుకుంటారా ఏమిటి?" మరొకడు.

పకపకా నవ్వారు అందరూ. ఎంతో స్వేచ్ఛగా, స్వచ్ఛంగా, నిర్మలంగా వుంది వారి నవ్వు.




"ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు ఇదేనేరా జీవితమంటే. ఈ దేశంలో కొన్ని లక్షలమంది తిండి, నీళ్ళు లేక బాధపడుతున్నారు. ముందు వాళ్ళకోసం పాటుపడాలి" ఎవరో అన్నారు వాళ్ళల్లో

ఎంత ఆనందం, ఎంత ఉత్సాహం, ఎంత చైతన్యం, ఎంత నమ్మకం వాళ్ళల్లో వీళ్ళే సమాజ నిర్మాతలు. దేశ నిర్ణేతలు. వీళ్ళే ఆశాకేతనాలు.

నాకూ వాళ్ళకూ మధ్య ఏదో అంతరం. తరానికీ తరానికీ మధ్య కాలం చేసే ఇంద్రజాలం. వాళ్ళూ మాలా కారు గదా. కారు. కాకూడదు. ఏదో ఆశ.

వెనక్కి తిరిగాను. తలుపు తీసిన చప్పుడుకు లేచినట్లుంది నా భార్య.

"ఎక్కడ్నుంచి" జంతువునో బల్లనో పలకరించినట్లు.

కొత్తదనాన్ని కొత్తలోనే చంపేసుకుంటున్న ఆలూ మగల మధ్య కూడా అంతా రొటీనే.

"టీ కోసం..."

"వయసొస్తున్నా ఇంకా ఈ అర్ధరాత్రి తిరుగుళ్ళేమిటి కాలేజీ కుర్రాడిలా" విసుగు కంఠంలో. ప్రక్కకు ఒత్తిగిల్లింది నిర్లక్ష్యంగా.

టీ తాగుతూ మాట్లాడుకుంటున్న ఆ నలుగురూ కళ్ళముందు కదిలారు.

ఔను. వయసు వస్తోంది కాని శరీరానికా, మనసుకా.

అర్థంలేని ప్రశ్న అనిపించే ఆంతరంగిక సంక్షోభం. మళ్ళీ యాంత్రికతలోకి